

ఇసుక ఫ్రీ..

నేటి నుంచే అమలు
హ్యాండ్లింగ్ చార్జీ టన్నుకు రూ.277
అందుబాటులో ఐదు స్టాక్‌పాయింట్లు
61 వేల టన్నుల ఇసుక సిద్ధం



పుట్టపర్తి, జూలై 7: ఇసుక కష్టాలకు చెక్. సోమవారం నుంచి ఇసుక ఉచితంగా లభించనుంది. ఆ మేరకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాండ్లింగ్ చార్జీల కింద టన్నుకు రూ.277 వసూలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటాగుళ్ల, రామగిరి స్టాక్ పాయింట్లలో ఇసుక సిద్ధంగా ఉంచామన్నారు.అవసరమైన వినియోగదారులు ఆయా స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చన్నారు. రవాణాచార్జీలు వినియోగదారుడు భరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే రవాణాచార్జీలు చెల్లించవచ్చన్నారు. హ్యాండ్లింగ్ చార్జీలను డిజిటల్ ద్వారానే చెల్లించాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నులు ఇసుక మాత్రమే అందిస్తారన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చన్నారు. స్టాక్ పాయింట్లలో 61వేల టన్నుల ఇసుకను సిద్ధంగా ఉంచామన్నారు. వంకలు, వాగుల్లో స్థానికులు ఎండ్లబండ్లలో ఇసుక ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు దరఖాస్తు చేసుకోండి

కదిరిఅర్బన్, జూలై 7: జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యాసంవత్సరంలో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కదిరి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు తాము పనిచేసిన కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు అందించాలన్నారు. ఈనెల 15న కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఒకే కళాశాలలో 5 సంవత్సరాలు పనిచేసిన వారికి బదిలీలు ఉంటాయని వెల్లడించారు.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తి, జూలై 7: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మండలం, మున్సిపల్ కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరంరూరల్, జూలై 7: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో ఆదివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న షిర్డీ సాయి, శ్రీసాయిరాం తదితర ఫర్టిలైజర్ షాపులను పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు శివకుమార్, ఏలూరు జిల్లా విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్ సంయుక్తంగా ఏడీఏ క్రిష్ణయ్యతో కలిసి తనిఖీలు చేశారు. స్టాక్ వివరాలు, విత్తనాలు, అనుమతులు, రికార్డులను పరిశీలించారు. స్టాక్‌లో వ్యత్యాసం ఉండడంతో 23.07 మెట్రిక్ టన్నుల రూ.5.67 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. రూ.92 వేల విలువైన పురుగు మందుల విక్రయాలు నిలిపేసినట్లు చెప్పారు. ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలనీ, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణ యజమానులను విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో ఏఓ ముస్తాఫా, టెక్నికల్ ఏఓ రవీంద్ర పాల్గొన్నారు.



అభివృద్ధి బాటలు..!

ఎన్‌హెచ్‌లకు నిధుల వరద

కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులు
12 వరుసలుగా ఎన్‌హెచ్ 44 విస్తరణకు పచ్చజెండా
వాటి వెంట పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు
జిల్లాకు మహర్దశ

పుట్టపర్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు తీపికబురు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. అభివృద్ధికి ప్రధాన మౌలిక సదుపాయమైన రహదారుల అభివృద్ధికి శరవేగంగా చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా మీదుగా వెళ్లే నాలుగు లేన్ల 44వ జాతీయ రహదారిని ఏకంగా 12 లేన్లకు విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. మరోవైపు కోడూరు-మేదరమెట్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు ఊపందుకోనున్నాయి. దీంతో జిల్లా ముఖచిత్రం మారనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు తొలి ఢిల్లీ పర్యటన జిల్లాకు తీపికబురు మోసుకొచ్చింది. కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశంలో ఇతర రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణానికి ప్రాథమికంగా ఆమోదం లభించింది. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో జిల్లా రహదారుల మణిహారంగా మారనుంది. ఈనేపథ్యంలో అందరిచూపు జిల్లాపై పడనుంది. జిల్లాలో అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్‌వే వెంట పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేసి, వాటికి ప్రోత్సాహకాలు ఇస్తోంది. తాజాగా జిల్లాలో బెంగుళూరు-హైదరాబాద్ 44వ జాతీయ రహదారిని 12 వరుసలుగా విస్తరించేందుకు ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. కొత్త రహదారులపై కేంద్ర ఉపరిత రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన స్టాండింగ్ ఫైనాన్షియల్ కమిటీతో పాటు ప్రధాన మంత్రి కార్యాలయం ఆమోదం పొందాక అవన్నీ అచరణలోకి వస్తాయి. ప్రస్తుతం ప్రాథమిక అమోదం పొందిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, హైవేలు సాకారమైతే బెంగళూరు-హైదరాబాద్, అమరావతికి మిగతా ప్రాంతాలకు చాలా సులువైన, మెరుగైన కనెక్టివిటీ ఏర్పడి అభివృద్ధి వరంగా జిల్లా జెట్ వేగంతో దూసుకెళ్తుంది.

అందరిచూపు.. జిల్లావైపు..

దేశంలో ఎక్కడ పండని 42 రకాల ఉద్యాన, వాణిజ్య పంటలకు జిల్లా పెట్టింది పేరు. జిల్లా వ్యాప్తంగా భూములు తక్కువ ధరకే లభిస్తున్నాయి. ఇలాంటి జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధి దిశగా ఉపాధి కల్పించాలని 38 ఏళ్ల క్రితమే జిల్లాలో ఎన్టీఆర్ పారిశ్రామికాభివృద్ధికి హిందూపురంలో తొలి అడుగువేశారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అనువైన భూములను గత టీడీపీ ప్రభుత్వం గోరంట్ల, సోమందేపల్లి పాలసముద్రం, గుడిపల్లి వద్ద గుర్తించింది. 2015లో ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కోటిక్స్ (నాసిన్), భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (బెల్) భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. 2016లో పెనుకొండకు కియ రాకతో ఉమ్మడి అనంత జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేసి, పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. జిల్లా రూపురేఖలు మారిపోయి, పారిశ్రామిక హబ్‌గా అవతరించింది. దీంతో ప్రపంచ పారిశ్రామిక వేత్తల చూపు జిల్లాపై పడింది. కియ కార్ల పరిశ్రమతో ప్రస్తుతం ఆటోమొబైల్ హబ్‌గా అవతరించగా.. భవిష్యత్తులో వైజాగ్-చెన్నై, బెంగళూరు-అనంతపురం పారిశ్రామిక కారిడార్‌కు బలం చేకూరి, ఉపాధి కల్పన జిల్లాగా మార్చేసింది. ఇప్పటికే సేకరించిన భూముల్లో ఏపీఐఐసీ మౌలిక సదుపాయాల కల్పన చేపట్టి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చిన ఔత్సాహికులకు భూములు అప్పగించేందుకు సిద్ధం చేశారు. పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర, రాళ్ల అనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద పరిశ్రమల కోసం 10వేల ఎకరాలకుపైగా గుర్తించారు. పెనుకొండ మండలం అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్ఎంఈల ఏర్పాటుతో ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి. హైదరాబాద్-బెంగళూరు మెట్రోనగరాలను కలుపుతూ 44వ జాతీయ రహదారి ఉంది. పలు జిల్లాలకు అనుసంధానంగా రహదారులున్నాయి. కర్ణాటకలోని బెంగళూరు శివార్లలో భూముల ధరలు భారీగా ఉన్నాయి. జిల్లాలో అతి తక్కువ ధరకే లభిస్తున్నాయి. హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో నీటి కొతర లేదు. ఈనేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటు చేసే వీలు ఉంది. నీరు, భూముల లభ్యతపై జిల్లా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం, హైదరాబాద్-బెంగళూరు హైవే విస్తరణతో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధితోపాటు లక్షల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి.



44వ నంబరు జాతీయ రహదారి



జాతీయ రహదారి నమూనా

అభివృద్ధి అనుసంధానం

జిల్లాలో బెంగళూరు-హైదరాబాద్ మెట్రో నగరాలను కలుపుతూ పెనుకొండ, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా విస్తరించిన నాలుగు వరుసల 44వ జాతీయ రహదారిని 12 వరుసలుగా విస్తరించేందుకు ప్రాథమికంగా కేంద్రం ఆమోదం తెలిపింది. ఈనేపథ్యంలో దక్షిణాదిలోనే అత్యధిక వరుసల రహదారి జిల్లాలో ఏర్పడబోతోంది. జిల్లాలో 75 కిలో మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే బెంగళూరు-మైదుకూరు కడప జిల్లా, మేదరమెట్ల అమరావతి-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ఆరు వరుసలతో నిర్మాణం సాగుతోంది. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే తలుపుల మండలం లక్కసముద్రం, ఓడులపల్లె పరిధిలో ప్రారంభమై చిలమత్తూరు మండలం కోడూరు వద్ద 44వ జాతీయ రహదారి వరకు 75 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. గోరంట్ల, హిందూపురం మధ్య 33.58 కి.మీ., మేర నాలుగు వరుసల రూ. 808 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణం పరిశీలన దశలో ఉంది. గత టీడీపీ హయాంలోనే కొడికొండ-శిర మధ్య 56.80 కి.మీ, మేర రూ.556 కోట్లతో జాతీయ రహదారి 544ఈ నిర్మాణం చేపట్టారు. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి మీదుగా కోడూరు దాకా జాతీయ దహదారి 342వ నిర్మాణం తుది దశకు వచ్చింది. కదిరి, గోరంట్ల మధ్య రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. జిల్లాకు రెండు విమానాశ్రయాలు అతి సమీపంలో ఉడడంతో ఎయిర్ కనెక్టివిటీ కలిసొస్తోంది. జిల్లా సరిహద్దుకు కర్ణాటకలో 80 కిలోమీటర్ల దూరంలో దేవనహళ్లి అంతర్జాతీ విమానాశ్రయం, పుట్టపర్తి నుంచి చుట్టూ 30 కి.మీ దూరంలో ఉంది. కోడూరు-మేదరమెట్ల ఎక్స్‌ప్రెస్‌వేని అమరావతి దాకా వేయనున్నారు. హైదరాబాద్-బెంగళూరు మధ్య జాతీయ రహదారి 44ను 12 వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతోపాటు అనుసంధానత ఏర్పడితే పెట్టుబడిదారులు క్యూకడతారు. లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి.రెండు, మూడేళ్లలో జిల్లాలో రవాణా అనుసంధానం పెరిగి పారిశ్రామిక కారిడార్‌గా అవతరించనుంది.

పశు వైద్యం.. చోద్యం..

పేరుకే ఆర్బీకేలు
మూడేళ్లుగా అందని నిధులు
పెరుగు మందు కూడా కరువు
పాడి రైతులకు తప్పని తిప్పలు



తనకల్లు, జూలై 7:
వ్యవసాయం నష్టాలు మిగుల్చుతుండడంతో జిల్లా రైతులు పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం వైపు మళ్లుతున్నారు. పాడి పెంపకం ద్వారా ఆర్థిక కష్టాల నుంచి ఉపశమనం పొందుతున్నారు. గత వైసీపీ పాలకులు.. రైతులను ఆదుకుంటామంటూ గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లు ఏర్పాటు చేశారు. హడావుడిగా సిబ్బందిని నియమించారు. ఇందులో పశుసంరక్షణ నిమిత్తం ఆర్బీకేల్లో వ్యవసాయంతోపాటు డిప్లొమా, వెటర్నరీ చదువుకున్న వారికి ఉద్యోగాలిచ్చారు. ఆర్బీకేలు ఏర్పాటు చేశాక ఒక్కసారి మాత్రమే పశువుల మందుల కొనుగోలు నిమిత్తం రూ.30వేల చొప్పున నిధులు విడుదల చేశారు. అప్పట్లో రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న పశు సంరక్షణాధికారులు తమ పరిధిలోని ఉన్నతాధికారుల(డాక్టర్ల)ను సంప్రదించి, వివిధ రకాల మందులు కొనుగోలు చేశారు. ఆర్బీకేలకు వచ్చే పాడి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఆ తరువాత నాటి వైసీపీ పాలకులు పశువైద్యాన్ని గాలికొదిలేశారు. పశువుల మందుల కొనుగోలుకు మూడేళ్లుగా రూపాయి కూడా నిధులివ్వలేదు. దీంతో పశుమందులే లేవు. దీంతో మందుల కోసం వచ్చే పాడి రైతులకు పశుసంరక్షణాధికారులు చీటీ రాసిచ్చి, పంపుతున్నారు. వాటిని రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఏటా రెండుమార్లు చిన్నజీవాలైన గొర్రెలకు పెరుగు మందు (నులిపురుగుల నివారణ మందు) తాపేవారు. ప్రభుత్వం ఆ మందును ఉచితంగా పంపిణీ చేసేది. రెండేళ్లుగా పెరుగు మందు కూడా రాకపోవడంతో చిన్నజీవాల రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఏటా జూన్‌లో పెరుగు మందు తాపాల్సి ఉంది. రెండేళ్లుగా పెరుగు మందు అందలేదని సంబంధిత డాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. ఆర్భాటంగా ఆర్బీకేలను ఏర్పాటు చేసిన గత వైసీపీ ప్రభుత్వం పెరుగు మందుకూడా ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో పాడి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వెంటనే నిధులు విడుదల చేసి, పెరుగు మందు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

గొర్రెలు అమ్మేసుకున్నా



గొర్రెలకు రెండేళ్లుగా పశువైద్యాధికారులు పెరుగు మందుకూడా ఇవ్వలేదు. అధికారులను అడిగితే నిధులు రాలేదంటున్నారు. పెరుగుమందు ఇవ్వకపోవడంతో గొర్రెలు జబ్బుల బారిన పడుతున్నాయి. మూడు గొర్రెలు చనిపోయాయి. చేసేదిలేక గొర్రెలను అమ్మేశా.

- సోమశేఖర్, రైతు, రాగినేపల్లి, తనకల్లు మండలం

మూడేళ్లుగా నిధులు రాలేదు

ఆర్బీకేలు ఏర్పాటు చేసిన కొత్తలో మందుల కొనుగోలు నిమిత్తం రూ.30వేల నిధులు విడుదలయ్యాయి. తరువాత పైసా కూడా రాలేదు.

- హరినాథ్‌రెడ్డి, పశువైద్యాధికారి, తవళం

చీటీలు రాసి.. పంపుతున్నారు



పశు మందుల కోసం ఆర్బీకేకి వెళితే చీటీలు రాసి, పంపుతున్నారు. కొక్కంటి క్రాస్‌కెళ్లి మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది అదనపు భారం. పశువుల మందులను ఆర్బీకేల్లోనే ఉచితంగా అందిస్తే.. ఆర్థిక ఉపశమనం దక్కుతుంది.

- శ్రీరాములునాయక్, రైతు, పెద్దపల్లి, తనకల్లు మండలం


విజేత కృష్ణా జట్టు


రన్నరప్ సెంట్రల్ జోన్ జట్టు

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల విజేత కృష్ణా

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీల విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కృష్ణా, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. విశాఖపట్నం 47ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. హితేసిని 71పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణా జట్టు 19ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 126పరుగులు సాధించింది. వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి మేరకు కృష్ణా జట్టును విజేతగా ప్రకటించారు. మెహాకా 53పరుగులు చేసింది. సెంట్రల్‌జోన్, అనంతపురం జట్లు తలపడగా అనంతపురం నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్లకు 177పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సెంట్రల్ జోన్ 14.2ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 95పరుగులు చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి మేరకు సెంట్రల్ జోన్ జట్టును విజేతగా ప్రకటించారు. మరోమ్యాచ్‌లో నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. సౌత్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నార్త్‌జోన్ 33.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 164పరుగులు చేసింది. పాయింట్ల ఆధారంగా కృష్ణా జట్టు విజేతగా, సెంట్రల్ జోన్ ద్వితీయ స్థానంలో, తృతీయస్థానంలో విశాఖపట్నం, నాలుగో స్థానంలో అనంతపురం, ఐదో స్థానంలో నిలిచాయి. నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మహిళా సెలెక్షన్ కమిటీ చైర్మన్ ప్రసాద్ ప్రకటించారు. కార్యక్రమంలో సెలెక్షన్ కమిటీ సభ్యులు దివ్య, తులసీరాం లక్ష్మీ, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు



మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం విద్య, జూలై 7: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ ఆలస్యమైతే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జీవో 117ను రద్దు చేయాలన్నారు. ప్రైమరీ స్కూళ్లను 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించాలన్నారు. జూన్, జూలై నెలల్లో అనేక మంది టీచర్లు రిటైర్డ్ అయ్యారని, వారి పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, నాయకులు పుల్లయ్య, హిమగిరి ప్రసాద్, రామమూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు


యూపీఎస్సీ పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, జూలై 7: జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఉదయం జరిగిన ఈపీఎఫ్ఓ పరీక్ష ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని రెండు కేంద్రాల్లో నిర్వహించారు. 434మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 117మంది రాసినట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఈఎస్ఐసీ పరీక్షను 6 కేంద్రాలలో నిర్వహించారు. పరీక్షకు మొత్తం 2,109మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 1712 మంది వచ్చారు. పరీక్షా కేంద్రాలను కలెక్టరు తనిఖీ చేశారు.

చర్చకు సిద్ధమా...!

- ఆరు మాసాల తర్వాత జడ్పీ సర్వసభ్య సమావేశం
- కొత్త ప్రభుత్వంలో తొలిసారి...
- 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు కూటమివారే..
- వస్తే... వేదికపైకి ముగ్గురు మంత్రులు
- మారిన సమీకరణాల నేపథ్యంలో సభపై అందరి దృష్టి
- పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు టీడీపీలోకి..
- వైసీపీ ఎమ్మెల్యేలకు దోచిపెట్టిన అధికారులు
- రూ.ఆరు కోట్లకుపైగా అక్రమ బిల్లులు
- రేపటి మీటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ



అనంతపురం విద్య, జూలై 7: నాడు అంతా ఏకపక్షం. సభ్యుల్లో 99 శాతం వైసీపీ వారే. దీంతో చర్చలు, తీర్మానాలు అంతా మూసధోరణే. కాలం మారింది. రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో జడ్పీలో సంఖ్యాబలం పెరిగింది. తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలతోపాటు, పార్లమెంట్ సభ్యులు మరికొందరు టీడీపీ, బీజేపీ పక్షాన జడ్పీటీసీలు, ఎంపీపీలు వెళ్లడంతో వైసీపీ సంఖ్యా బలం తగ్గిపోయింది. దీంతో 9న జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంపైనే అందరికీ దృష్టి ఉంది. కొందరు వైసీపీ ఎమ్మెల్యేలకు జడ్పీలోని కోటరీగా మారిన అధికారులు కోట్ల రూపాయలు దోచిపెట్టారు. పుట్టపర్తి, మడకశిర మాజీ ఎమ్మెల్యేలకు చెందిన కొన్ని బినామీ సంస్థలకు రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకూ బిల్లులు అడ్డగోలుగా దోచిపెట్టినట్లు విమర్శలు వచ్చాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సభలో కూటమి ప్రభుత్వ సభ్యుల బలం పెరిగిన నేపథ్యంలో చర్చలు ఆసక్తికరంగా, రసవత్తంగా ఉంటాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

సమావేశాలంటే లెక్కలేదు...

జడ్పీలో సమావేశాలు నిర్వహణ అంటే లెక్కలేకుండా పోయింది. చట్టాలను తొక్కేసి, సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి 17న సమావేశం నిర్వహించారు. 90 రోజుల అనంతరం సమావేశం నిర్వహించాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల కోడ్‌కు అటు, ఇటుగా కడప ఇతర జిల్లాల్లో కూడా సమావేశాలు నిర్వహించారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం జడ్పీ అధికారులు సాకులు చూపుతూ సమావేశం నిర్వహించలేదు. నిర్ణీత గడువు ముగిసిన 2 మాసాల తర్వాత 9న మళ్లీ సమావేశం నిర్వహించబోతున్నారు. అయితే జడ్పీ సర్వసభ్య సమావేశాలకు నడుమ స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించాలి. అయితే ఫిబ్రవరిలో ఒక స్టాండింగ్ నిర్వహించినా.. జడ్పీ అధికారుల వైఖరి బహిష్కరిస్తూ సభ్యులు వాయిదా వేశారు. వాయిదా పడిన మరుసటి రోజే స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఆ సంప్రదాయాన్ని కూడా అధికారులు పాటించలేదు. దీంతో ఇక్కడ సమావేశాల నిర్వహణ, చట్టాల అమలు బుట్టదాఖలు చేశారు. గత సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలులో జడ్పీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వచ్చారు. దీంతో జడ్పీ మీటింగ్, స్టాండింగ్ కమిటీలు నిర్వహిస్తే ఎక్కడ సభ్యులు తమను ప్రశ్నిస్తారన్న సాకుతో వాయిదా వేస్తూ వస్తున్నారు. పాలకవర్గాన్ని ధిక్కరించేలా వ్యవహరిస్తూ వస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంలో తొలిసభ

రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తొలిసభ 9న జరగనుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఈ క్రమంలో ఎన్నికల ముందు, తర్వాత పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు పార్టీలు మారారు. ఇప్పటికే పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు టీడీపీతోపాటు, బీజేపీలో చేశారు. దీనికితోడు కొత్తగా ఎంపికైన 14 మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు సభలో అడుగుపెట్టనున్నారు. మారిన పరిణామాల నేపథ్యంలో నాడు ప్రతిపక్షం వైపు ఉండాల్సిన టీడీపీ సభ్యుల బలం పెరిగినట్టేనని చెప్పాలి. ఇప్పుడు సభ్యుల్లో కీలకంగా మారిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల నేపథ్యంలో చర్చలు రసవత్తంగా మారనున్నాయనడంలో సందేహం లేదు. ఉమ్మడి జిల్లా కావడంతో ముగ్గురు మంత్రులు, ఇద్దరు కలెక్టర్లతో వేదిక కళకళలాడనుంది.

విచారణ సాగేనా?

జడ్పీలో ఈ రెండున్నరేళ్ల కాలంలో కొందరు జడ్పీ ఉన్నతాధికారులు వైసీపీ ప్రజాప్రతినిధులకు కోట్ల రూపాయలు దోచిపెట్టారు. వైసీపీకి చెందిన పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే, మడకశిర ప్రాంతానికి చెందిన మరో మాజీ ప్రజాప్రతినిధి బినామీ కాంట్రాక్టర్లకు ఇష్టారాజ్యంగా బిల్లులు చేశారు. జడ్పీలో ఉన్నతాధికారిగా పనిచేసి వెళ్లిన ఓ ఉన్నతాధికారి హయాం నుంచే అడ్డగోలుగా బిల్లులు చేస్తూ వచ్చారు. విచారణలో ఉన్నా బిల్లులు చేశారు. వైసీపీ వాళ్లంటే ఎక్కడలేని ప్రేమ చూపిస్తూ రాత్రికి రాత్రే సదరు అధికారి ఆధ్వర్యంలో కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించారు. ఖరీదైన సెల్‌ఫోన్, కమీషన్ల కోసం సదరు ఆఫీసర్ బాగానే లాగేశారంటూ జడ్పీ ఉద్యోగులే చెబుతున్నారు. తర్వాత వచ్చిన ఉన్నతాధికారులు సైతం ఆయన చెప్పినట్లు తలలు ఊపడంతో వైసీపీ నాయకులకు అక్రమ బిల్లుల పంట పడింది. రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకూ ఈ స్కాం సాగినట్టు విమర్శలు వస్తున్నాయి. కొత్త ప్రభుత్వంలోనైనా కొందరు వైసీపీ వీర విధేయ అధికారుల అక్రమాలపై విచారణ చేయంతోపాటు, అదుపు తప్పిన జడ్పీ, స్టాండింగ్ కమిటీ నిర్వహణపై, జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చలు ఎంతైనా అవసరం. కూటమి ప్రభుత్వంలో తొలిసారి జరిగే జడ్పీ మీటింగ్‌పై అందరి దృష్టి ఉంది.

టమోటా సాగుకు రైతుల ఆసక్తి

- నారుకు భారీ డిమాండ్
- అమాంతం ధర పెంచేసిన నర్సరీల నిర్వాహకులు
- నాణ్యత ప్రశ్నార్థకం
- ఆందోళనలో అన్నదాతలు




నర్సరీలో పెంచుతున్న టమోటా నారు

కళ్యాణదుర్గం, జూలై 7: మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సామాన్యులు కొనాలంటే ఆలోచించేంత స్థాయికి చేరాయి. ఈ ధరలే అన్నదాతను ఊరిస్తున్నాయి. ఇక టమోటా ధరలు చూస్తే టచ్ చేసి చూడు అంటున్నాయి. దీంతో టమోటా సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్నారు. నారు కొందామని వెళితే విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీనిని నర్సరీల నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. అమాంతం నారు ధరలు పెంచేశారు. నాణ్యత కూడా ప్రశ్నార్థకమే. పెరిగిన ధరలు, నాణ్యతపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో ఈ సారి సుమారు 500 ఎకరాలకు పైబడి టమోటాలను సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న నర్సరీల యజమానులు నారు ధరను అమాంతంగా పెంచేశారు. ఒక్కొక్క మొక్క రూ.50 పైసల నుంచి రూ.70 పైసలకు విక్రయిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో 16కిపైగా నర్సరీలు వున్నాయి. వీటిలో అధిక శాతం వాటికి అనుమతులు లేవు. వాటిలో నారు ధరలు పెంచేశారు. ఇప్పటికే ఒక్కొక్క నర్సరీ లక్ష నుంచి మూడు లక్షల మొక్కల వరకు విక్రయించారు. వాటి యజమానులు ధర పెంచడంతోపాటు మొక్కల కొరత చూపుతున్నారు. నర్సరీల్లో కనీసం ఏ రకం మొక్కలు వేశారో కూడా పట్టించుకోకుండా రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీనిని సొమ్ము చేసుకునేందుకు యజమానులు కల్తీకి తెరలేపారు. నకిలీ విత్తనాలతో టమోటా మొక్కలు పెంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగా యేటా ఎంతో మంది రైతులు టమోటా పంట సాగు చేసి కనీస దిగుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు శాపం..

పంట సాగు సమయంలో నర్సరీల ద్వారా రైతులకు విక్రయించే మొక్కలు పరిశీలించి వాటిని రైతులు నాటు కోవడానికి అనువుగా ఉన్నాయా లేదా అని తెలియజేయాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు యేటా తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సరీలను పర్యవేక్షించే అధికారులే కరువయ్యారు. కనీసం పంటలు పెట్టే సమయంలోనైనా నర్సరీలపై అధికారుల పర్యవేక్షణ లేకపోతే రైతుకు మరిన్ని కష్టాలు తప్పవు. అధికారులు మామూళ్ల మత్తులో పడి నర్సరీలను తనిఖీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని నర్సరీల్లో రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేలా పర్యవేక్షించాల్సి వుంది.



నాణ్యమైన మొక్కలు అందించాలి

రైతులకు నాణ్యమైన టమోటా మొక్కలు అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం నర్సరీల్లో ఎలాంటి రకాలు ఇస్తున్నారో కూడా తెలియదు. అదును దాటడంతో టమోటా సాగుకు అష్టకష్టాలు పడుతున్నాం. పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. పంట చేతికొచ్చే సమయానికి ధరలు ఆశాజనకంగా వుంటేనే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. లేదంటే మరోసారి నష్టాలు తప్పవు.

-బొమ్మయ్య, రైతు, కరిగానపల్లి, కుందుర్పి మండలం



ధర.. రైతుకు అందుబాటులో ఉండాలి

నర్సరీల్లో టమోటా నారు ధరలు రైతులకు అనుగుణంగా వుండాలి. డిమాండ్‌ను బట్టి ధర పెంచితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. పెట్టుబడులు విపరీతంగా పెరుగుతాయి. దీని ప్రభావం సాగు విస్తీర్ణంపై పడుతుంది. ఇప్పటికైనా నర్సరీల్లో నారు ధరలు పెంచకుండా రైతుకు తక్కువ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి.

-ఈరణ్ణ, కరిగానపల్లి, కుందుర్పి మండలం

బదిలీలకు వేళాయె..!

- రెవెన్యూ శాఖలో బదిలీల టెన్షన్
- డీఆర్‌ఓ, ఆర్డీఓ పోస్టులకు నేతల కసరత్తు
- మండలాల కోసం తహసీల్దార్ల పైరవీలు
- డీటీలు, ఆర్ఐలదీ ఇదే పరిస్థితి..

అనంతపురం టౌన్, జూలై 7: ప్రభుత్వ పాలనలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖను ప్రస్తుతం బదిలీల టెన్షన్ పట్టుకుంది. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టింది. జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలు, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు సైతం రెండు, మూడు రోజుల్లో చేపట్టనున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. కీలకమైన జాయింట్‌కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్డీఓల పోస్టులపై జిల్లా అధికార పార్టీల నేతలు కసరత్తు చేసి ఓ కొలిక్కి తెచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యంలోనే ప్రస్తుతమున్న జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓలు ఇక్కడి నుంచి బదిలీ అవుతారని పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి ఏ జిల్లాకు వెళ్లాలనుకున్నారో ఆ జిల్లాకు రెకమెండ్ చేస్తానని ప్రస్తుత జేసీకి హామీ ఇచ్చినట్లు మాట్లాడుకుంటున్నారు. దీనిని బట్టి చూస్తే జేసీ బదిలీ ఖాయమనిపిస్తోంది. ఆయన వెళితే జాయింట్ కలెక్టరుగా ఎవరు వస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదంటున్నారు.

డీఆర్‌ఓ సైతం..

ప్రస్తుత డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి బదిలీ కూడా ఖాయమనిపిస్తోంది. ఆయన స్థానంలో ఇదే జిల్లాలో నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న ఓ మహిళా డిప్యూటీ కలెక్టరు డీఆర్‌ఓగా రానున్నట్లు సమాచారం. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలకు స్థానచలనం తప్పదంటున్నారు. వీరి స్థానంలో డిప్యూటీ కలెక్టర్లుగా ఇటీవల ఉద్యోగోన్నతులు పొంది పక్క జిల్లాలకు వెళ్లిన హరినాథ్, విశ్వనాథ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మరో మహిళా అధికారి సైతం జిల్లాలోని ఓ డివిజన్‌కు ఆర్డీఓగా రావడానికి ప్రయత్నిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు.

వారంలో సొంత జిల్లాకు తహసీల్దార్లు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్లు ఇతర జిల్లాలకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇపుడు వారంతా మళ్లీ ఈ జిల్లాకు రానున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసి సీఎం ఆమోదం కోసం పంపినట్లు తెలిసింది. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే రెండు మూడు రోజుల్లో తిరిగి సొంత జిల్లాలకు పంపే ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

ప్రాధాన్యం మేరకు పోస్టింగ్

తహసీల్దార్లు ఇక్కడకు వచ్చిన తర్వాత జిల్లా కలెక్టరు వారికి మండలాలు కేటాయించి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడ ఆయా నియోజకవర్గాల అధికార పార్టీ నేతల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఈక్రమంలోనే తమకు అవసరమైన, అనుకూలమైన మండలాలలో పోస్టింగ్‌లు వేయించుకోవడం కోసం పలువురు పైరవీలు సాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తమకు అవకాశం కల్పించాలని కోరుతూ లెటర్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసుకుంటున్నారు. వీరిలో కొందరు గతంలో ఇక్కడ వైసీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తి, ఇష్టానుసారంగా అక్రమాలకు తోడ్పాటు అందించి, టీడీపీ శ్రేణులను, సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టారు. దీంతో టీడీపీ ప్రజాప్రతినిధులు సైతం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఆ తహసీల్దార్లు మాత్రం ఇవన్నీ మామూలేనంటూ ఆయా ఎమ్మెల్యేలకు అత్యంత అనుకూలంగా ఉంటున్న మండలాల నాయకులకు ఎర వేసి వారి నుంచి పనిని సానుకూలం చేసుకునే యత్నాలు చేస్తున్నారు.



డీటీలు, ఆర్ఐల పైరవీలు

రెవెన్యూశాఖలో ఏపని జరగాలన్నా కిందిస్థాయి ఉద్యోగులు అనుకూలంగా ఉండాల్సి ఉంటుంది. అందుకే కిందిస్థాయి ఉద్యోగుల నియామకాలకు సైతం పెద్దఎత్తున పైరవీలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 'మమ్మల్ని మీమండలానికి వేయించుకోండి మీరు చెప్పినట్లు చేసి పెడతాం' అంటూ కొందరు డీటీలు, ఆర్ఐలు ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులు కూడా అపుడు వారు చెప్పినట్లు విన్నాం, చేశాం. ఇపుడు మీరు చెప్పినట్లు వింటాం, చేస్తాం అంటూ నేతల వద్ద విన్నవించుకుంటున్నారు. డీటీలు, ఆర్ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పెద్దఎత్తున వస్తుండటంతో నేతలు సైతం ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో అర్థంకాక తలలు పట్టుకొని మీపేర్లు రాయించి పోండని చెప్పి పంపిస్తున్నారు.

రానున్న మూడురోజుల్లో

తేలికపాటి వర్షసూచన

బుక్కరాయసముద్రం, జూలై 7: పశ్చిమ, దక్షిణ మధ్య బంగాళాఖాత తీరంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో తేలిక పాటి వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులతో వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ కమిటీ ఏర్పాటు

కదిరిఅర్బన్, జూలై 7: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా హ్యాండ్‌బాల్ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు విజయకుమార్ తెలిపారు. జిల్లా ఉపాధ్య క్షులుగా పక్రుద్దీన్, కార్యదర్శి మహేష్, కోశాధికారి వంశీ, జాయింట్ సెకటరీ ప్రసన్న కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.

ఆంధ్రా మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా మచ్చా రామలింగారెడ్డి



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7: బీసీసీఐ అనుబంధంగా ఉన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మహిళా క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా జిల్లాకు చెందిన మచ్చా రామలింగారెడ్డి నియమితుడయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.




నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, జూలై 7: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'అవతారవైభవంలో ఆదిపర్వం' నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. సంగారెడ్డి జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజూ కొనసాగాయి. అవతారవైభవంలో ఆదిపర్వం పేరిట ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను మైమరపింపజేసింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.87 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3.87 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2.51 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.36 లక్షలు వచ్చిందని తెలిపారు.



కాశీంస్వామి తొలి దర్శనం

మొహరం వేడుకలు ప్రారంభం

బత్తలపల్లి, జూలై 7: బత్తలపల్లిలో ఖాశీంస్వామి మొహరం వేడుకలు ఆదివారం పారంభం అయ్యాయి. పెట్టెలో ఉన్న ఖాశీం స్వాములను శుభ్రం చేసి పీర్ల మకాంలో ఆశీనులు చేశారు. ఉమ్మడి అనంత జిల్లాలోనే గూగుడు కుళ్లయిస్వామి వేడుకలు తరువాత అంతటి స్థాయిలో బత్తలపల్లి మొహరం వేడుకలు జరుగుతాయి. ఆదివారం రాత్రి ఖాశీంస్వామి తొలి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

ముదిగుబ్బ, జూలై 7: సీఐటీయూ మండల కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, శ్రామిక మహిళా అధ్యక్షురాలు దిల్‌షాద్, సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా బండల వెంకటేష్, కో కన్వీనర్లుగా సూర్య నారాయణ, ఓబిలేసు, శివకుమార్, రజియాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

కదిరిఅర్బన్, జూలై 7: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సులను కొనసాగించాలని, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో ప్రభు త్వాన్ని కోరారు. డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును తొలగించేలా తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

వేరుశనగకు లద్దెపురుగు



నంబులపూలకుంట, జూలై 7: ఖరీఫ్‌లో నీటి పారకం కింద సాగుచేసిన వేరుశనగకు లద్దె పురుగు సోకిందని రైతులు వాపోతున్నారు. పది రోజులుగా ఎండ తీవ్రత తగ్గడం, చల్లని వాతారవణ ఉండడంతో లద్దె పురుగు ఆకులకు రంధ్రాలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం పంట సాగుచేసి 60 రోజులు కావస్తోందన్నారు. ప్రస్తుతం పిందెలు వచ్చే అవకాశముందన్నారు. పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశజనంగా పంట ఉందని, తెగుళ్ల వలన పంట దిగుబడి తగ్గే అవకాశముందన్నారు. ఇపట్కికే రెండుమార్లు మందులు పిచికారి చేసినా.. తగ్గలేదని కొత్తపల్లికి చెందిన బాలిరెడ్డి ఆవేదన చెందారు. ఈ విషయాన్ని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లగా... లీటర్ నీటికి రెండు ఎంఎల్ ల్యామిడా సైలోత్రిన్ కలిపి ఎకరాకు పిచికారి చేయాలన్నారు. అలాగే ఎకరాకు నాలుగు లింగాకార్షక బుట్టలు ఏర్పాటు చేయాలని, ఎకరాకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేస్తే లద్దె పురుగును నియంత్రివచ్చని సూచించారు.

బాధిత కుటుంబాలకు పల్లె పరామర్శ



యేసప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న పల్లె

నల్లమాడ, జూలై 7: మండలంలోని ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ కుమారుడు వినోద్ ముదిగుబ్బ మండలంలో రైలు కిందపడి శనివారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామాని కెళ్లి వినోద్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులు పరామర్శించారు. అలాగే మండలంలోని మనకవంకపల్లికి చెందిన మాజీ సర్పంచ్ యేసప్ప అనారోగ్యంతో మృతిచెందారు. పల్లె ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. బొగ్గిటివారిపల్లిలో గంగాద్రి భార్య సుబ్బమ్మ అనారోగ్యంతో మరణించారు. పల్లె ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు పరామర్శించారు.

సెల్ సిగ్నల్స్ అందని చౌటకుంటపల్లి

నల్లమాడ, జూలై 7: మండలంలోని చౌటకుంటపల్లి గ్రామంలో ఏ కంపెనీకి చెందిన సెల్ టవర్ లేకపోవడంతో ఆ గ్రామస్థులు సెల్ సిగ్నల్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామానికి సమీపంలో ఉన్న కుటాలపల్లి, దొన్నికోట, కురమాల, కొండకమర్ల గ్రామాల్లో సెల్‌టవర్లు ఉన్నాయి. చౌటకుంటపల్లి వరకూ ఆ సిగ్నల్స్ రావడం లేదు. దీంతో గ్రామస్థులు సెల్ ఫోన్‌లో మాట్లాడాలంటే గ్రామానికి దూరం వెళ్లాల్సిన దుస్థితి ఉంది. మిద్దె ఎక్కితే అరకొరగా సిగ్నల్స్ అందుతున్నాయి. గ్రామంలో వెయ్యికి పైగా వివిధ రకాల సిమ్‌కార్డులున్నాయి. ఇటీవల జియో టవర్ వారు గ్రామాన్ని పరిశీలించారు. ఇంతవరకు టవర్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. ఏపీ ఫైబర్ నెట్ కేబులు నల్లమాడ నుంచి కొండకమర్ల వరకులేదు. ఈ కేబుల్ వస్తే చౌటకుంటపల్లి నెట్‌వర్కు వస్తుంది. అత్యవసర సమాచారాన్ని గ్రామస్థులు ఇతరులకు చెప్పాలంటే ఊరి బయటకు వెళ్లి.. సెల్‌ఫోన్ చేసుకోవాల్సిందే. ఇక ఈ గ్రామస్థులకు ఇతర ప్రాంతాల వరకు అత్యవసరంగా సమాచారం ఇవ్వాలంటే పక్క గ్రామస్థులకు ఫోన్ చేసి చెబితే.. వారు చౌటకుంటపల్లి గ్రామానికి వెళ్లి సమాచారం ఇవ్వాల్సిన దుస్థితి ఉంది.

ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా..?



నేలపైనే ఉన్న విద్యుత్ తీగలు



ముచ్చురామిలో స్తంభం బదులు ఉంచిన కట్టె



వసంతపురం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న తీగలు

- పొలాల్లో వేలాడుతున్న మృత్యుతీగలు
- తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- ముచ్చురామిలో స్తంభాలు లేక కట్టెల ఏర్పాటు
- కట్టెలు విరిగిపోవడంతో నేలపైనే తీగలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ధర్మవరంరూరల్, జూలై 7: పొలాల్లో ఎక్కడా చూసిన విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతూ యమపాశాలుగా మారాయి. మరికొన్నిచోట్ల నేలపైనే ఉన్నాయి. అధికారులకు ఎంతచెప్పినా పెడచెవినా పెడుతున్నారని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో తీగలు వేలాడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు లేక కట్టెలను ఏర్పాటు చేశారు. అవి గాలికి విరిగిపోవడంతో... నేలమీదే విద్యుత్ తీగలు ఉన్నాయి. ముచ్చురామి గ్రామంలో బోగే నారాయణరెడ్డి పొలంలో చేతికందె ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయి. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయలేదని, దీంతో తానే తీగలను కట్టెల సాయంతో ఎత్తులో ఉంచినా.. గాలికి కిందకు పడిపోతున్నాయని ఆయన వాపోయారు. వసంతపురం గ్రామ సమీపంలో ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహ దారి పక్కన ఓ రైతు పొలంలోనూ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తు లో ఉన్నాయి. రాత్రి పూట పొలాల్లోకి వెళ్లాలం టేనే భయంగా ఉందని ఆ రైతులు వాపోతు న్నారు. పొరపాటుగా కొత్తవారు తోటల వద్ద కు వస్తే ఆ తీగల తగిలి మృత్యువాతపడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి: ఎస్‌టీయూ

కదిరిఅర్బన్, జూలై 7: గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల విడుదల చేసిన జీవోలను రద్దు చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలని, అలాగే ఉన్నత పాఠశాలలో ఆంగ్లమాధ్యంతో పాటు తెలుగును సమాతర మాధ్యంగా కొనసాగించాలని అన్నారు. ఉపాధ్యాయులపై బోధనేత కార్యక్రమాల పనిభారం తగ్గించాలన్నారు. ఉపాధ్యాయుల కొరతను, పని సర్దుబాటు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ద్వారా నియమించాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింప చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరు పాత పింఛన్ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛనర్లకు చెల్లించాల్సిన బకాయిలపై నిర్ణయం ప్రకటించాలన్నారు. 1998-2008 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ ప్రాతిపదిక నియమించాలని కోరారు. అనతరం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఖదర్‌వలీ, సుకుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, గోపాల్‌నాయక్, మురళీ, గోవిందునాయుడు, బిఎస్ ప్రసాద్, రవీంద్ర, జవహర్, సీపీఐ వేమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు రఘునాథ్‌రెడ్డి

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు

ధర్మవరంరూరల్, జూలై 7: పూరిలో జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా ఆదివారం పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథ్, బలరామ, సుభద్ర ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు హరినామసంకీర్తన చేశారు. ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ ఉపన్యాసించారు.

జగన్నాథుడి అలంకరణలో త్రిలింగేశ్వరుడు

పట్టణంలోని తేరుబజార్ సమీపంలో బసవన్నవీధిలో వెలసిన త్రిలింగేశ్వరుని ఆలయంలో ఆదివారం పూరిజగన్నాథుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూరీలో శ్రీజగన్నాథుడి రథోత్సవంలో భాగంగా ఆలయఅర్చకుడు రాఘవశర్మ ప్రత్యేకంగా త్రిలింగేశ్వరుడికి జగన్నాథుడి అలంకరణ చేశారు.





అలంకరణలో జగన్నాథ్, బలరామ, సుభద్ర ప్రతిమలు, జగన్నాథ అలంకరణలో త్రిలింగేశ్వరుడు

విద్యాసామగ్రి పంపిణీ

కొత్తచెరువు, జూలై 7: కొత్తచెరువు మండలంలోని నాగిరెడ్డిపల్లి, పుట్టపర్తి రహదారిలోని గుట్టసమీపంలోని గుడిసెల్లో ఉన్న పేద విద్యార్థులకు కిజ్మత్ ఏ ఖల్క్‌చారిటబుల్ ట్రస్టు షామీర్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. గుడిసెల్లో ఉంటూ చదువుకుంటున్న 80 మంది విద్యార్థులకు పలక, నోట్ పుస్తకాలు, పెన్సిల్ తదితర వాటిని సుమితి, లావణ్య, నవీన్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, జావిద్, సోహేల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న దృశ్యం

కంటివైద్య శిబిరం

ధర్మవరం, జూలై 7: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో 95 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా.. 58 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు యువర్స్ పౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, చేనేత ప్రముఖులు సందారాఘవ, జింకాపురుషోత్తం, యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సుంకుసుకుమార్, జయరాం పాల్గొన్నారు.



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాధనం వృథా

గాండ్లపెంట, జూలై 7: గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్లక్ష్యం వల్ల కేవలం మండలంలోనే రూ.లక్షల ప్రజాధనం నిరుపయోగమైంది. మండల వ్యాపంగా పలు పంచాయతీల్లో గత వైసీపీ ప్రభుత్వం కుప్పలు తెప్పలుగా సరిహద్దురాళ్ల వేయించింది. నాటి పాలకులు భూరక్ష భూహక్కు పథకంలో భాగంగా పలు గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. కమతంపల్లి, మద్దివారిగొంది. జీన్లకుంట, సామచేనుబైలు, మడుగువారిగొందిలో రీసర్వేలో భాగంగా అరకొరగా రికార్డుల్లో అడంగల్ మార్చారు. రైతుల పొలాల వద్ద అరకొరగా సరిహద్దురాళ్ల నాటి చేతులు దులుపుకున్నారు. మరికొన్ని పంచాయతీలైన గాండ్లపెంట, వేపరాల, కురమామిడి పంచాయతీల్లోనూ అరకొరగానే సర్వే చేశారు. భూముల్లో సరిహద్దు రాళ్ల కుప్పలుగా ఇలా వేశారు. ఈ సర్వే రాళ్లపై వైఎస్ఆర్ జగనన్న అనే పేరును ముద్రించారు. ప్రచారంపై ఉన్న శ్రద్ధ. పథకాన్ని సక్రమంగా అమలు చేయడంపై వైసీపీ పాలకులు చూపకపోవడంపై... తద్వారా ప్రజాధనం వృథా కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బొల్లుగుంట్లపల్లి వద్ద వృథాగా పడేసిన సరిహద్దు రాళ్లు



రాయిపై ఉన్న మాజీ సీఎం పేరు



వెలగని వీధిదీపాలు

ఎన్ రెడ్డివారిపల్లిలో గ్రామస్థుల ఇక్కట్లు

నంబులపూలకుంట: మండల కేంద్రం సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లిలో విద్యుత్ దీపాలు వెలకగ పోవడంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోలార్ ఏర్పాటు చేసిన దీపాలు కూడా సాయంత్రం నుంచి రెండు గంటల పాటు పనిచేస్తాయని, తరువాత వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో బయటకు రావడానికి ఆ గ్రామస్థులు జంకుతున్నారు. అసలే వర్షాలు కురుస్తున్నాయని, చుట్టుప క్కల గ్రాసం ఏపుగా పెరగడంతో విషపురుగుల సంచారం అధికంగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారు లు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

← వెలగని వీధి లైట్

వీధిలో అలుముకున్న చీకటి →





ధర్మవరంలో గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఘనంగా గోనుగుంట్ల జన్మదినం

ధర్మవరం, జూలై 7: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గోనుగుంట్ల వ్యక్తి గత కార్యాలయం వద్ద కేక్‌కట్ చేశారు. అనంతరం దుర్గమ్మ ఆలయంలో గోనుగుంట్ల సూర్యనారాయణ పేరిట అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల అభిమానులు బొడగల గిరిధర్, చిలకం సూర్యనారాయణరెడ్డి, పొరాళ్ల రహీం, రంగానాయుడు, మహేశ్‌బాబు, చిదంబర నాయుడు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, బోయనపల్లి సుజాత, సాహెబ్బీ, ఓలేటి మురళి, గంధమనేని నారాయణస్వామి పాల్గొన్నారు.

బత్తలపల్లి: బత్తలపల్లిలో గోనుగుంట్ల జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన వ్యక్తి గత కార్యాలయంలో కేక్ కట్ చేశారు.

ముదిగుబ్బ: గోనుగుంట్ల సూర్యనారాయణ జన్మదినం సందర్భంగా ఆయన వర్గీయులు ముదిగుబ్బలో కేక్ కట్‌చేశారు. అందరికి స్వీట్లు పంచారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ జన్మదినాన్ని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్మవరంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎదుట జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాను ధర్మవరం, కేతిరెడ్డికాలనీలో ఎల్-2, ధర్మవరం మండలంలోని దర్మపురిలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబులేసు, జింకాచంద్ర పేద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీచేశారు. అమడగూరులో అంబేద్కర్ సర్కిల్ మహాజనపాత్రికేయుడు ఎం. యల్లమరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కదిరిలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో, నల్లచెరువులో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు భరత్ కుమార్ ఆధ్వర్యంలో, నంబులపూలకుంటలోని అంబేద్కర్ నగర్‌లోని ఆర్డీటీ భవనంలో తాలూకా అధ్యక్షుడు దండోరా రెడ్డెప్ప ఆధ్వర్యంలో, ఓబుళదేవరచెరువులో సర్పంచ్ గోవిందు ఆధ్వర్యంలో, తనకల్లులో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గంగరాజు ఆధ్వర్యంలో, తాడిమర్రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి



హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ మంజులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కదిరి, జూలై 7: పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కేరళ, కలకత్తా, ముంబై హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ మంజుల చెల్లూరు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం విశిష్టతను అర్చకులు వివరించారు. అనంతరం స్వామివారి శ్వేత వస్త్రా, స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. వారి వెంట కదిరి కోర్టు న్యాయమూర్తులు ఎస్. జయలక్ష్మి, ఎస్. ప్రతిమ. పి. మీనాక్షిసుందరి, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

13న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం, జూలై 7: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న స్వర్ణోత్సవాలను, జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో క్రికెట్ టోర్నీమెంట్‌కు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఈ టోర్నీని పెనుకొండ ప్రభు త్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామని, దీనికి కన్వీనర్‌గా జిల్లా కార్యదర్శి జీసీ నరేశ్ వ్యవహరిస్తారని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, రాంప్రసాద్, సకల చంద్రశేఖర్, సురేశ్, రామాంజనేయులు, సాయిగణేశ్, వెంకటకిశోర్, రామాంజినేయులు పాల్గొన్నారు.

చీనీతోటల పరిశీలన



చీనీ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బత్తలపల్లి, జూలై 7: స్థానిక బత్తలపల్లిలో సమీపంలోని చీనీ తోటలను ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాగపూర్‌కు చెందిన కేంద్ర పరిశోధన సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు ఆదివారం పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు పాటించవలసిన పద్ధతులను వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

కదిరి: స్థానిక ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 1976-79 బ్యాంచ్‌లో డిగ్రీ చదివిన విద్యార్థులు ఆదివారం అదే కళాశాలలో సమావేశమయ్యారు. నాటి అధ్యాపకులను, ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ సిత్మాను సన్మానించారు.



కన్నుల పండువగా లక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో యోగ నరసింహస్వామి మూల విరాట్

హిందూపురం అర్బన్, జూలై 7: పట్టణ పరిధిలోని కోటలో ఉన్న రాఘవేంద్రస్వామి మఠంలో కొలువైన యోగ లక్ష్మీ నరసింహస్వామి వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచే వివిధ పూజలు చేశారు. మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను, వెండి కవచం, పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాండురంగరావు, కార్యదర్శి వరదరాజులు, అర్చకులు కౌషిక్, శ్రీవత్స, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

లేపాక్షి, జూలై 7: మండలకేంద్రమైన లేపాక్షిలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి మండల టీడీపీ కన్వీనర్ జయప్ప రూ.20వేలు విరాళం అందించారు. శివాలయం నిర్మిస్తున్న విషయాన్ని కమిటీ సభ్యులు జయప్ప దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి తనవంతు సాయం అందించారు.

సిద్దప్పస్వామికి ప్రత్యేక పూజలు

రొళ్ల, జూలై 7: మండలంలోని టీడీపల్లి జోగిగుట్టపై వెలిసిన సిద్దప్పస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హొట్టేబెట్ట ప్రజలు టీడీపీ గెలుపు కోసం మొక్కుబడిలో భాగంగా ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు గెలుపొందడంతో ప్రత్యేక పూజలు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఘన సన్మానం చేశారు. వేలాది మంది భక్తులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న దానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, హొట్టేబెట్ట అధ్యక్షులు శ్రీనివాస్, రవి, ఎంపీపీ కిష్టప్ప, సిద్దగంగప్ప, భరత్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రథమ దర్శనం

ప్రారంభమైన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

నార్పల, జూలై 7: మతసామరస్యానికి ప్రతీకగా నిలచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం వైభవంగా జరిగింది. కుళ్లాయిస్వామి పీరును పెట్టెలో నుంచి బయటకు తీసి పసుపు, గంధం, పన్నీరు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రథమ దర్శనం కావడంతో తాడిమర్రి, యల్లనూరు, శింగనమల, బుక్కరాయసముద్రం, బత్తలపల్లి, తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గూగూడుకు చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి శోభా, దేవదాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వర్గాల విద్యాభివృద్ధికి కృషి

గోరంట్ల, జూలై 7: చేనేత కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి గోరంట్లకు చెందిన పవర్‌లూమ్స్ యజమానులు విద్యాసామాగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. పవర్‌లూమ్స్ యజమానులు కట్టా రామచంద్ర, కట్టా నారాయణ, వట్టే నారాయణస్వామి కలిసి విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు సమకూర్చారు. చౌడేశ్వరీకాలనీలోని రామాలయం వద్ద ఉన్న చేనేత కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి ఈ పంపిణీ చేపట్టామని వారు తెలిపారు. మాజీ ఎంపీటీసీ నిమ్మల యువశేఖర్ చేతుల మీదుగా వందమంది విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో జొలి కిష్టప్ప, ఉపాధ్యాయులు జగదీశ్వర్, సురేష్‌గురుజీ, ప్రసాద్, వెంకటేష్‌బాబు, వృషభదేవుడు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

హిందూపురం, జూలై 7 : హిందూపురం మండలం గోళ్లాపురంలో దాడిలో మృతిచెందిన సతీష్ కుటుంబానికి కార్మిక సంఘం నాయకుడు రవికుమార్ ఆర్థిక సాయం అందించారు. గోళ్లాపురానికి చెందిన సతీష్ నాలుగు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సతీష్ కుటుంబానికి రవికుమార్‌రూ.10వేలు అందిం చారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం నాయకులు బాబు, సురేష్, నరసింహమూర్తి, రామక్రిష్ణ, జగదీశ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'క్రైస్తవులకు టీడీపీ అండ'

పెనుకొండ టౌన్, జూలై 7 : క్రైస్తవులకు టీడీపీతోనే గుర్తింపు, అండ అని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో ఆదివారం ఆరాధన సభలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పట్టణ కన్వీనర్‌ను క్రైస్తవులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం క్రైస్తవులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, గతంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. సూపర్‌సిక్స్ పథకా లతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి సవితను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

చేతిపంపును మరమ్మతు చేయండి

గుడిబండ, జూలై 7: మండలంలోని ఎస్ రాయాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట ఉన్న చేతిపంపు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరారు. చేతిపంపు పనిచేయక పోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కరెంటు లేని సమయంలో చేతిపంపు ద్వారా నీటిని తీసుకెళ్తున్నట్లు ప్రజలు తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే చొరవ తీసుకుని చెడిపోయిన చేతిపంపు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు.

ఎంఎస్ ధోనీ జన్మదిన వేడుకలు

గోరంట్ల, జూలై 7: క్రికెట్ క్రీడాకారుడు మహేంద్రసింగ్ ధోనీ 43వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. గోరంట్లకు చెందిన అన్నపూర్ణ జయసింహ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. త్రివర్ణపతాకాన్ని చేతపట్టుకుని, ఆనందోత్సాహాల నడుమ సంబరాలు చేసుకున్నారు. ధోనీ ఫ్లెక్సీ ఎదుట కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం 200మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధోనీ అభిమానులు జయదేవ్, శంకర్, జనార్దన్‌రెడ్డి, వెంకటసాయి, ఉదయ్‌కిరణ్ తదితరులున్నారు.


కేక్ కట్ చేస్తున్న ధోనీ అభిమానులు

గత ఎమ్మెల్యే అసమర్థత వల్ల నష్టం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూలై 7: గత ప్రజాప్రతినిధి స్వార్థ చింతన వల్ల నియోజకవర్గానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విమర్శించా రు. ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమను మడకశిర పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద నెలకొల్పుతున్న నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని యాదవ కల్యాణమండపంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పలమనేరు తిప్పేస్వామి అప్పట్లో డబ్బులు డిమాండ్ చేయడంతో ఎంతో మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాటలోనే ఈ ప్రాంతంలో మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అలాగే రొళ్ల, అగళి మధ్యలో మరో పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పది వేల మందికి ఉపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, డీఆర్‌డీఏ జిల్లా పీడీ నరసయ్య, ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమ నిర్వాహకులు కాంతరాజు, సోమశేఖర్, సిద్దు, ఏజే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎమ్మెల్యే పర్యటన: పట్టణవాసులు ఎదుర్కొంటున్న సమస్యల తెలుసుకోనేందుకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పటు కాలనీల్లో పర్యటించారు. ఉదయం 6 గంటలకే పట్టణం అంతా తిరిగారు. మున్సిపల్‌కార్యాలయం వద్ద మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

పారిశ్రామికాభివృద్ధికి కృషి

మడకశిర: వెనకబడిన మడకశిర ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. వారు ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వం మడకశిర మండల పరిధిలోని ఆర్ అనంతపురం వద్ద 1600 ఎకరాలను సేకరించిందని తెలిపారు. ఆ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి వేల మందికి స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకోసం కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని, రాష్ట్ర పారిశ్రామిక శాఖ మంత్రి భరత్‌ను కలిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఎండీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి కొరత పరిష్కరించాలి

మడకశిర(అమరాపురం), జూలై 7: అమరాపురం మండల పరిధిలోని హేమావతి ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా విద్యుత్ సమస్య కారణంగా నీటి కొరత ఏర్పడినట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి, పాఠశాల సిబ్బంది తెలిపారు. వారు ఆదివారం మాట్లాడుతూ 220 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారుకు, తాగునీటికి, ఇతర అవసరాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నీటి కొరత విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, సత్వరమే విద్యుత్ సమస్యను పరిష్కరించి విద్యార్థులకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎంపీ అంబికాను కలిసిన వాల్మీకులు


ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిసిన వాల్మీకి నాయకులు

హిందూపురం, జూలై 7: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను హిందూపురం వాల్మీకి కుల సంఘం నాయకులు ఆదివారం కలిశారు. ఎంపీని అనంతపురంలోని ఆయన నివాసంలో ఆయన కలిసి సన్మానం చేశారు. ఎంపీగా గెలిచిన తర్వాత హిందూపురం వాల్మీకులు అక్కడికి వెళ్లి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణప్ప, వెంకటరమణప్ప, ఆకుల సూర్యనారాయణ, కట్లరాజు, విజయ్‌కుమార్, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి


నల్లప్ప (ఫైల్)

రాప్తాడు, జూలై 7: మండలంలోని బండమీద పల్లి పంచాయతీ వరిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చవల నల్లప్ప(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు నల్లప్ప వ్యక్తిగత పని నిమిత్తం శనివారం అనంతపురం పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. శనివారం రాత్రి తిరిగి స్వగ్రామం వస్తుండగా బుక్కచెర్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నల్లప్ప తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావమై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నల్లప్పకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. నల్లప్ప మృతదేహానికి బండమీదపల్లి, వరిమడుగు టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందచేశాడు.

హైకోర్టులో అర్చకులకు ఊరట

రాయదుర్గంరూరల్, జూలై 7: మండలంలోని మెచ్చిరి గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు జరుపుకునేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విషయాన్ని గ్రామంలో ప్రజలకు సమా చారాన్ని అందించి ఆలయంలో పూజలు జరపాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. దీంతో అర్చకులు తిరిగి అర్చకత్వానికి హాజరయ్యారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూమి 25.40 ఎకరాల ఉంది. కాగా అందులో పంటలు సాగుకు మూడేళ్ల క్రితం అర్చకులు వ్యవసాయ అధికారులతో కలిసి కౌలురైతుల కింద పేర్లను నమోదు చేసుకున్నారు. దీనికి స్థానికులు కొందరు అభ్యంతరం తెలిపారు. దీంతో అర్చకులు కోర్టుకు వెళ్లి అప్పటి నుంచి అర్చకత్వానికి కూడా దూరంగా ఉన్నారు. అప్పట్లో దేవాదాయశాఖ వారు పంచాయతీలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పుడు అర్చకులకు సానుకూలంగా తీర్పు రావడంతో వారు పూజలు మొదలుపెట్టారు. జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, అర్చకులు, సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జీతాలు పెంచాలని 104 ఉద్యోగుల వినతి


ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

మడకశిరటౌన్, జూలై 7: జీతాల పెంపు విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తమపై వివక్ష చూపిందని మడకశిర ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 104 ఎంఎంయూ ఉద్యోగులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు విన్నవించారు. ఈ ప్రభుత్వమైనా జీతాలు పెంచి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వారు ఆదివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామిని స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమకు జీతాలు పెంచడంతో పాటు 104 వాహన సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని కోరారు. అలాగే డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను ఆప్కోస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు నెల నెలా సకాలంలో చెల్లించాలని, చట్ట ప్రకారం యజమాన్యం కట్టాల్సిన పీఎఫ్ వాటా చెల్లించేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు.

'పొలానికి, ఇంటికి దారి చూపండి'

మడకశిర(అమరాపురం), జూలై 7: తమ పొలానికి, ఇంటికి వెళ్లే దారిని కొందరు ముళ్లకంపలు వేసి మూసివేశారని అమరాపురం మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ హొసహట్టి గ్రామానికి చెందిన శంకరమ్మఅనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.... వారసత్వంగా సంక్రమించిన భూమిలో ఇల్లు నిర్మించుకున్నామని, అనాది కాలం నుంచి ఆ దారిలోనే రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అయితే ఆ దారికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న తమ పొలానికి, ఇంటికి వెళ్లే దారిని కంపచెట్లు వేసి మూసివేశారని వాపోయారు. దీంతో పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి కూడా దారి లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపలను తొలగించేందుకు వెళితే తమపై గొడవలకు వస్తారని, దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆమె పేర్కొన్నారు. స్థానిక పోలీసులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

చినుకు పడితే ప్రయాణానికి ఇబ్బందులు


సీసీగిరి రోడ్డులో నిలిచిన వర్షపునీరు

గుడిబండ, జూలై 7: చిన్నపాటి వర్షం వచ్చిన మండల పరిధిలోని పలు గ్రామాలకు ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మట్టి రోడ్లు కావడంతో పాటు గుంతల మయం అయ్యాయి. దీంతో వర్షం కురిసినప్పుడు బురదమయం కావడమే గాకుండా ఆ గుంతల్లో నీరు నిలిచి వాహనదారుల ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్ని రోడ్లలో రైతులు నడిచి వెళ్లేందుకు సైతం అననుకూలంగా తయారయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎంఎస్ తండా నుంచి సీసీగిరి, మేకలగట్టు, జమ్మలబండ, కొంకల్లు గేటు నుంచి కొంకల్లు గ్రామానికి రోడ్లు ఇలాంటి స్థితిలో ఉన్నాయి. గుడిబండ నుంచి పీఎన్ పాళ్యం నుంచి వడ్డెరహట్టి, ఎంఎస్ తండా గ్రామాలకు వెళ్లే రోడ్లదీ ఇదే పరిస్థితి. వర్షాకాలంలో రోడ్లు బురదమై ప్రయాణికులకు రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మట్టిరోడ్లను బీటీరోడ్లగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


సోమందేపల్లిలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 7: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ స్థాపించి 30ఏళ్ల అయినందున వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు బీ రామాంజినేయులు, కదిరిప్ప, నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ వెంకటేశులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చల్లాపల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. నాయకులు శివ, హరీష్, ఈశ్వర్, ఓబులేసు, పెద్దన్న, రామాంజినేయులు, నరసింహులు, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్‌వీ రమణ, నరసింహులు, హనుమత్, ఓబులేశు, సైకిల్ నరసింహులు, వానవోలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలలుగా తాగునీటికి కటకట

ఇనగలూరు ప్రజల ఆవేదన

అగళి, జూలై 7: మండలపరిధిలోని ఇనగలూరులో ప్రజలకు తాగునీరు అందించేందుకు 2018వ సంవత్సరంలో ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించింది. ఎస్‌డీపీ గ్రాంట్ కింద రూ.10లక్షలతో గ్రామీణ నీటి సరఫరా, శుద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఎనిమిది నెలల కిందటి వరకు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేవు. ఎనిమిది నెలల క్రితం ప్లాంటు మరమ్మతు లకు వచ్చి నిరుపయోగంగా మారింది. దీంతో ప్రైవేట్ వాహనాల్లో తీసుకొస్తున్న తాగు నీటిని బిందె రూ.10నుంచి రూ.15 చెల్లించి కొనుగోలు చేసి తాగుతున్నామనిన గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ప్లాంటు మరమ్మతుల కోసం రూ.40వేలు వరకు ఖర్చవుతుందని, ప్రస్తుతం తమ దగ్గర డబ్బులు లేవని పంచాయతీ అధికారులు సమాధానమిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే ప్లాంటు మరమ్మతులు చేపట్టి తాగునీటి పథకాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఇనగలూరులో మరమ్మతులకు నోచుకోని తాగునీటి ప్లాంటు

భక్తి శ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర


పురవీధుల్లో ఊరేగుతున్న జగన్నాథుడి రథం

హిందూపురం అర్బన్, జూలై 7: జగన్నాథ రథయాత్రను పట్టణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు చేసి, సాయంత్రం పుర వీధుల్లో రథయాత్ర చేపట్టారు. రాత్రి స్వామికి పుష్పాభిషేకం చేసి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. రథయాత్ర సందర్భంగా హరినామ సంకీర్తనతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో రథయాత్ర సాగింది.

117 జీఓను రద్దు చేయాలి : యూటీఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న

మడకశిరటౌన్, జూలై 7: ప్రభుత్వ విద్యా సంస్థలకు 117వ జీఓ గొడ్డలిపెట్టు అని, వెంటనే దానిని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని కేపీ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ జోనల్‌స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూతన్న మాట్లాడుతూ.... దళిత, బడుగు బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేయాలన్న సంకుచిత ధోరణితో గత వైసీపీ ప్రభుత్వం 117వ జీఓను తెచ్చిందని విమర్శించారు. అలాగే ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయాలని, నియంతృత్వ ధోరణితో తెచ్చిన 117వ జీఓతో అప్పట్లో ప్రభుత్వ బడుల పతనానికి నాంది పలికిం దన్నారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా వదలలేదని వాపోయారు. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం ఎంతో సంతోషకరవిషయం అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మాలింగప్ప, జోగప్ప, నరసింహప్ప, గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలి: బీఎస్పీ


ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం అర్బన్, జూలై 7: బహుజన సమాజ్‌వాది పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసినవారు ఎంతటి వారైనా పట్టుకుని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. హిందూపురంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆర్మ్ స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన మృతి బీఎస్పీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ కొల్లకుంట నాగరాజు, హిందూపురం నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు హరికుమార్, నారాయణ, తిరుమలేష్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి ఆభరణాల సమర్పణ


ఆలయ అర్చకుడికి వెండి ఆభరణాలు అందచేస్తున్న దాతలు

గార్లదిన్నె, జూలై 7: మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు రూ.61,580 విలువ చేసే వెండి ఆభరణాలను సమర్పించారు. అనంతపురం పట్టణానికి చెం దిన గొంది హేమంత్‌కుమార్, నాగలక్ష్మి దంపతు లు ఆదివారం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్ర సాదాలు అందుకున్నారు. అనంతరం రూ.61,580 విలువ చేసే 54 తులాల వెండి పంచ హారతులను అందచేసి మొ క్కులు తీర్చుకున్నారు. ఆభరణాలను ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డీ.హీరేహాళ్, జూలై 7: మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో గల హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. బళ్లారికి చెందిన మహబూబ్ బాషా(22), స్నేహితుడు అనిల్‌కుమార్ ఆదివారం బైక్‌పై షికారు కోసం ఓబుళాపురానికి వచ్చారు. కొద్దిసేపు అనంతరం తిరిగి బళ్లారికి బయలుదేరారు. ఓబుళాపురం సమీపంలో బళ్లారి - బెంగుళూరు హైవేలో మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. ప్రమాదంలో మహబూబ్‌బాషా బాషా తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అనిల్‌కుమార్‌కు తీవ్రగాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహబూబ్‌బాషా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కన్నడ భాష ఉనికిని కాపాడుకుందాం

కన్నడ సాహిత్యపరిషత్ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు సిద్దలింగప్ప

పావగడ, జూలై 7: ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ భాషపట్ల అవగాహన కల్పించి, భాష ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కన్నడ సాహిత్యపరిషత్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ సిద్దలింగప్ప అన్నారు. పావగడ పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఆదివారం కన్నడ సాహిత్య పరిషత్ తాలూక స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాలు, మేధావులతో సర్వసభ్య సమావేశం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా కన్నడ భాష ఉనికిని కాపాడుకోవాలని తెలిపారు. ఈనెల 22న సువర్ణ కర్ణాటక జాగృతి రథోత్సవం పావగడకు రానుందని, కన్నడ భాషాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాహిత్యపరిషత్ తాలూకా అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి కోరారు. నాయకులు అంతర్‌గంగ శంకరప్ప, నాగరాజు, మహ్మద్‌ఇమ్రాన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి చికిత్స శిబిరానికి స్పందన

పావగడ, జూలై 7 : తాలూకా పరిధిలోని తిరుమణి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం హెల్ప్ సొసైటీ, బెంగళూరి సప్తగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరానికి మంచి స్పందన లభిం చింది. మనిషి అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని, జాగ్రత్తగా కాపాడుకోవాలని తిరుమణి గ్రామపంచాయతీ అధ్యక్షుడు లోకేష్ చౌదరి సూచించారు. తిరుమణి ఆరోగ్య అధికారి రమేష్, డాక్టర్ శ్రీకాంత్, లయ, నవీన్‌కుమార్, ఉష, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.